క్లుప్తంగా

సమాచార హక్కు చట్టం ఆదిబట్ల అధ్యక్షుడిగా లక్ష్మణ్


నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మణ్

ఇబ్రహీంపట్నం రూరల్: సమాచార హక్కు చట్టం-2005 పరిరక్షణ సమితి ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌ను నియమించారు. రాష్ట్ర, జిల్లాశాఖ సూచన మేరకు శుక్రవారం లక్ష్మణ్‌కు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మహేందర్ నియామక పత్రం అందజేశారు.

వీరన్నపల్లిలో కంటి వెలుగు శిబిరం


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: మండలంలోని వీరన్నపల్లిలో శుక్రవారం వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నాగమణి లింగంగౌడ్‌తో కలిసి కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. శిబిరంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైనవారికి శిబిరంలో కళ్లద్దాలు, మందులను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సైదమ్మ, కార్యదర్శి జంగయ్య, లింగంగౌడ్, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి


నారాయణ దంపతులను సన్మానిస్తున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో వాటర్ మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న నారాయణ సేవలు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మరవలేరని మున్సిపల్ చైర్ పర్సన్ కే స్రవంతి అన్నారు. గ్రామ, నగర పంచాయతీ, మున్సిపాలిటీలో సుమారు 43 సంవత్సరాలు పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న నారాయణ ఆయన సతీమణి భిక్షమ్మలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. నారాయణ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్లు శ్వేత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలతో ఆరోగ్య భద్రత


మౌనిక కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పల్లె దవాఖానాలతో ప్రజలందరికీ ఆరోగ్య భద్రత లభిస్తోందని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్‌కు చెందిన మౌనికకు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కావడంతో శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ చుట్టూ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ నిరుపేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పెద్ద మొత్తంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, నాయకులు రమేష్, నరేష్, రాజు, తిరుపతయ్య, లాలయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయంలో ఆలయ నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శుక్రవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీ గణపతి హోమ పూజలు నిర్వహించడం జరిగిందని ఈఓ స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలి తెలిపారు. కార్యక్రమంలో అర్చక సిబ్బంది, భక్తులు ఉన్నారు.


కడ్తాల్: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పీఎస్‌లో జెండావిష్కరణ


ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో..


తలకొండపల్లి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంబరాన్నంటిన 'దశాబ్ది' సంబురం

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకుని పదో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, ఇతర పార్టీల పిలుపు మేరకు దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ప్రభుత్వ, రాజకీయ పార్టీల కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసి సంబురాలను జరుపుకున్నారు. అమరవీరుల స్థూపం, వారి చిత్రపటాలకు నివాళి అర్పించారు. పార్టీలకతీతంగా అందరు నాయకులు, ప్రజలు వేడుకల్లో పాల్గొని తెలంగాణ ఐక్యతను చాటారు.

– సాక్షి, నెట్‌వర్క్


ఇబ్రహీంపట్నం: అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, నేతలు


తుర్కయంజాల్: డీసీసీబీ కార్యాలయంలో జాతీయ గీతాలాపన


యాచారం మండల పరిషత్ కార్యాలయంలో


మంచాల: పంచాయతీ సిబ్బందిని సన్మానించిన నాయకులు


కడ్తాల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



తలకొండపల్లి: వేడుకల్లో సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది


ఆమనగల్లు: మార్కెట్ కమిటీ కార్యాలయంలో..


ఆమనగల్లు: సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం


అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం కార్యాలయంలో..

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు


మున్సిపల్ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకల్లో చైర్‌పర్సన్ అనురాధ

- రెండు గ్రూపులుగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- చైర్‌పర్సన్ పదవి ఇవ్వాల్సిందే అంటున్న రొక్కం అనిత

తుర్కయంజాల్: పురపాలక సంఘం పాలక కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. శుక్రవారం నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఇందుకు వేదికగా నిలిచాయి. చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లతో కలిసి తుర్కయంజాల్‌లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించగా.. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న అదే పార్టీకి చెందిన రొక్కం అనితవర్గం మిగతా కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు కలిసి రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. అదేవిధంగా ఈనెల 1న ఉత్సవాల ఏర్పాట్లపై చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ మాత్రమే హాజరైనట్లు సమాచారం. అనిత వర్గానికి చెందిన వారంతా సమావేశానికి గైర్హాజరయ్యారు. ఒకే పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు రెండు గ్రూపులుగా విడిపోయి వేడుకలను నిర్వహిండం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

అమలుకాని ఒప్పందం..

జనవరి 27వ తేదీ 2020న చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి అనురాధకు అప్పటి ఒప్పందం ప్రకారం 2022 జూలై నెలతో గడువు ముగిసిన విషయం అందరికీ తెలిసిందే. ఒప్పందం ప్రకారం రొక్కం అనితా చంద్రశేఖర్ రెడ్డికి పదవిని అప్పగించాల్సి ఉంది. అయితే అప్పటినుంచి ప్రతీసారి ఏదో ఒక కారణం చూపి పదవిని పొడిగిస్తూనే ఉన్నారు. దీంతో ఆ పదవిని ఆశిస్తున్న రొక్కం అనితా పదవిని తనకు అప్పగించాల్సిందేనని భీష్మించుకుని కూర్చున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల గడువు మాత్రమే ఉండటంతో నియోజకవర్గంలో కీలకమైనటువంటి తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులు కొనసాగుతుండటం ఆ పార్టీకి నష్టం చేకూర్చనుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పంట నష్ట పరిహారం మంజూరు


వడగళ్ల వానకు దెబ్బతిన్న పంట (ఫైల్)

యాచారం: ఇబ్రహీంపట్నం డివిజన్‌లో మార్చి నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన వరి పంటకు ప్రభుత్వం పరిహారం డబ్బులు మంజూరు చేసింది. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు ఎకరా వరి పంటకు రూ. 10వేల చొప్పున పరిహారం మంజూరయ్యింది. యాచారం మండలంలోని 379 మంది రైతులకు రూ. 53,81,000, మంచాల మండలంలోని 230 మంది రైతులకు రూ. 39,43,000 మంజూరయ్యాయి. ఈ రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో మార్చి నెలలో కురిసిన వడగళ్ల వల్ల వరి పంట పూర్తిగా నష్టపోయింది. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు వ్యవసాయాధికారులు పంట నష్టపోయిన వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపించారు. దీంతో పరిహారం డబ్బు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

గ్రామం	రైతులు	ఎకరాలు	మంజూరైన డబ్బులు
చింతపట్ల	68	132.16	13,24,000
మొండిగౌరెల్లి	76	97.13	97,3,250
మంతన్‌గౌడ్	18	10.24	10, 6000
మంతన్‌గౌరెల్లి	60	96.11	96,2,750
నల్లవెల్లి	75	95.39	95,9,750
సుల్తాన్‌పూర్	82	105. 21	10, 55,250
మంచాల			
బొడకొండ	80	70.33	70,8,250
శ్రీమంతగూడెం	113	262.10	26,22,500
దాద్‌పల్లి	37	61.09	61,2,250

బాధిత రైతులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మృతిచెందిన ఎద్దులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: విద్యుదాఘాతంతో ఎద్దులు మృతిచెందిన సంఘటనలో రైతులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. విద్యుత్ మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో విద్యుదాఘాతంతో గ్రామానికి చెందిన కట్ట అంజయ్యకు చెందిన ఆవు,ఎద్దు.. కట్ట పోచయ్యకు చెందిన రెండు ఎద్దులు.. కట్ట మహేశ్‌కు చెందిన రెండు ఎద్దులు.. యాదయ్యకు చెందిన ఒక ఎద్దు గురువారం మృతిచెందాయి. బాధిత రైతులను నాగర్‌కర్నూల్ జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజిసింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డితో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. అనంతరం ఒక్కో ఎద్దుకు రూ.10 వేలు చొప్పున ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అలాగే ఒక్కో ఎద్దుకు రూ.10వేల చొప్పున ఠాకూర్ బాలాజీసింగ్ బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ రవితేజ, సర్పంచ్ జంగయ్యగౌడ్, నల్లచెరువు సర్పంచ్ మాలతి, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్, సీఐ కృష్ణమోహన్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు రైతు దినోత్సవం

మంచాల: మంచాల మండలంలో శనివారం నిర్వహించే రైతు దినోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని మంచాల ప్రాథమిక రైతు సహకార సంఘం చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు మాడ్గుల ఎంపీడీఓ రాఘవు లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

విజయవంతం చేయాలి..

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శనివారం నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గెలుపోటములను సమదృష్టితో చూడాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి, తదితరులు

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: గెలుపు ఓటములను సమాన దృష్టితో చూస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. క్రీడలతో ఆరోగ్యం లభించడమే కాదు, ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత ఏర్పాటు చేసిన ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడలను శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో 8జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు రూ. 25 వేలు, రన్నర్ జట్టుకు రూ. 15వేలు, తృతీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ. 10వేలు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిల్, శ్రీను, యాదగిరి, శ్రీకాంత్, యాదయ్య, ఆర్గనైజర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

- జెడ్పీటీసీ దశరథ్ నాయక్


రైతువేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించే రైతు దినోత్సవాన్ని జయప్రదం చేద్దామని జెడ్పీటీసీ దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. రైతు దినోత్సవ వేడుకల నిర్వహణపై శుక్రవారం కడ్తాల్‌లోని రైతువేదిక వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉత్సవాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, జిల్లా నాయకులు లక్ష్మణ్ నాయక్, సర్పంచ్‌లు యాదయ్య, సులోచన, ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ శారద, ఏవో శ్రీలత,ఏఈవో స్వాతి పాల్గొన్నారు.

మక్తమాధారం, ముద్వీన్ క్లస్టర్లలో..

మండల కేంద్రంతో పాటు మక్తమాధారం, రావిచేడ్, ముద్వీన్ క్లస్టర్లలో శనివారం ఉదయం 9గంటలకు రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీలత తెలిపారు.